ఆంధ్రజ్యోతి
3
ANDHRAJYOTHY
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 21 మే 2024





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 20: పటిష్ఠమైన భద్రత నడుమ ఓట్ల లెక్కింపునకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'శాంతి భద్రతల దృష్ట్యా జిల్లాలో 144 సెక్షన్ కొనసాగాలి. డీఎస్పీలు రెండు కో-ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించాలి. జిల్లాలో ఉన్న 120 పెట్రోలు బంకుల నుంచి లూజు పెట్రోలు విక్రయించకుండా సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాల'ని డీఎస్‌వో బి.శాంతిశ్రీని ఆదేశించారు. 'జిల్లాలోని గ్రామదేవత పండుగలు జరుపుకునే ప్రాంతాల్లో సమూహాలుగా ఉండరాదు. ఆ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించరాదు. మందుగుండు సామగ్రి విక్రయించకుండా లైసెన్సులు కలిగిన యజమానులకు నోటీసులు జారీ చేయాలి' అని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌వో నూరుల్ కమర్, డీఎస్పీ ప్రేమ్‌కాజల్, సెబ్ ఏఎస్పీ గంగాధరం, రిటర్నింగ్ అధికారులు భరత్‌నాయక్, సీహెచ్ రంగయ్య, అప్పారావు, లక్ష్మణమూర్తి, సుదర్శనదొర, రామ్మోహనరావు, డీఎస్పీలు పాల్గొన్నారు.

లూజు పెట్రోలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

జిల్లాలోని పెట్రోలు బంకుల యజమానులు పెట్రోలు, డీజిల్‌ను లూజు విక్రయాలు చేపడితే లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి బి.శాంతిశ్రీ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు పూర్తయేవరకు, ఎమ్‌సీసీ నిబంధనలు అమలులో ఉన్నంతవరకు పెట్రోలు, డీజిల్‌ను కంటెయినర్స్, డ్రమ్స్, సీసాల్లో సరఫరా చేయరాదని స్పష్టం చేశారు.

- భూముల రీ సర్వే అనుసంధానం తీరిది
- 'భూ రక్ష'లో తప్పులతడకగా వివరాలు
- క్రయవిక్రయాలకు తప్పని ఇబ్బందులు
- ఆందోళన చెందుతున్న రైతులు

ఒకరి భూమి.. ఇంకొకరి ఆధార్‌తో..!

- ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడికి చెందిన జగన్నాథ పాడికి గత 50 ఏళ్ల నుంచి మెళియాపుట్టి మండలం కుడ్డబ రెవెన్యూ పరిధిలో సుమారు 1.20 సెంట్ల భూమి ఉంది. పాస్‌బుక్ ఆయన పేరునే ఉన్నా.. ఆన్‌లైన్‌లో ఆ భూముల వివరాలు కనిపించకపోవడంతో 1-బీ కానీ, అడంగళ్ కానీ రావడం లేదు. ఎఫ్ లైన్ కట్టినా ప్రయోజనం కనిపించలేదు. భూమి విక్రయించి.. కుమార్తెకు వివాహం చేయాలనుకున్నారు. కానీ రిజిస్ట్రేషన్ కాక.. వివాహాన్ని వాయిదా వేశారు. ప్రస్తుతం జగనన్న భూ సర్వే జరిగే పరిస్థితి లేదని రెవెన్యూ అధికారులు చెబుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

- మెళియాపుట్టి మండలం మర్రిపాడు(సి) రెవెన్యూ పరిధిలో సుమారు 6 ఎకరాల భూమి ఉంది. ఇక్కడ సర్వే నెంబర్లు తప్పులు కావడంతో తరుచూ రైతుల మధ్య భూవివాదాలు జరుతున్నాయి. భూ సర్వే చేద్దామంటే ఇక్కడ సిగ్నల్ రాక సర్వే అధికారులు సైతం చేతులెత్తేయడంతో రైతులు అయోమయం చెందుతున్నారు.

- కంచిలి మండలం జనార్దనపురానికి చెందిన ఒక రైతుకి వేర్వేరు సర్వే నెంబర్లలో 87 సెంట్లు భూమి ఉంది. అతనికి ఒకే ఎల్‌పీ, ఖాతా నెంబరులో విస్తీర్ణం మొత్తం నమోదు చేశారు. దీంతో తన భూమిని విక్రయించేందుకు వీలులేకుండా పోతోందని ఆ రైతు లబోదిబోమంటున్నాడు.

- సోంపేట మండలం పలాసపురానికి చెందిన ఒక రైతు భూమిని గతంలో అధికారులు చుక్కల భూమి(22ఎ/ప్రభుత్వ స్థలం)గా తప్పుగా నమోదు చేశారు. ఇప్పుడు అధికారులు రీ సర్వే చేసినా.. అది చుక్కల భూమిగానే ఉండడంతో ఆ రైతు ఆవేదన చెందుతున్నాడు.

(కంచిలి/ మెళియాపుట్టి)

వైసీపీ ప్రభుత్వం జగనన్న భూ రక్ష పేరిట ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియ రైతులకు శాపంగా మారింది. క్షేత్రస్థాయిలో అధికారులకు శిక్షణ, అవగాహన కల్పించకుండా.. ఈ ప్రక్రియ చేపట్టడంతో భూ యజమానులకు నష్టం వాటిల్లుతోంది. చాలాచోట్ల తప్పుడు వివరాలు నమోదు కావడంతో ప్రజలు, రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒకరి పాస్ పుస్తకానికి మరొకరి ఆధార్ నెంబర్ అనుసంధానం చేయడం, రెండు.. మూడు చోట్ల ఉన్న భూములకు సైతం ఒకే నెంబర్ కేటాయిస్తున్నారు. దీంతో భూముల క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అసలు భూమికి, పాస్ పుస్తకాల్లో నమోదు చేస్తున్న భూమి విస్తీర్ణానికి పొంతన లేకపోవడంతో రైతులు, భూ యజమానులు తలలు పట్టుకుంటున్నారు. సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు. కాగా ఆన్‌లైన్‌లో మార్పులకు అవకాశం లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అధికారులు చెబుతున్నారు.

సమస్యలెన్నో..

భూ వివాదాలు, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టింది. 2022 అక్టోబర్ 2న భూహక్కు పత్రాలు సైతం కొంతమందికి పంపిణీ చేసింది. ఈ పథకం ద్వారా భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టారు. జిల్లాలో 1,466 రెవెన్యూ గ్రామాల్లో 9,86,000 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా.. ఇంతవరకు కొంతమేర ప్రక్రియ సాగింది. ఉదాహరణకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇప్పటివరకూ 80 శాతం భూ రీ సర్వే ప్రక్రియ పూర్తయింది. కంచిలి మండలంలో 58 రెవెన్యూ గ్రామాలకుగాను 34 గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వే జరిగింది. 15 గ్రామాల్లో ఆన్‌లైన్ మ్యాపింగ్ పూర్తి చేయగా, మరో 9 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉంది. సోంపేట మండలంలో 38 గ్రామాలకుగాను 22 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. 14 గ్రామాల్లో జియోమ్యాపింగ్ పూర్తికాగా, మరో రెండు గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత.. భూ రక్ష పనులు నిలిచిపోయాయి. కాగా.. గతంలో ఉన్న లోపాలను సవరించి, తప్పులు సరిదిద్దుతామని ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే.. లోపభూయిష్ఠంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రీ సర్వే తర్వాత భూ యజమానికి ఇచ్చే 14 అంకెల కోడ్ యూఎల్‌పీఎన్(యూనిక్ ల్యాండ్ ఐడెంటిఫికేషన్ నంబర్)లో తప్పుగా వివరాలు నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్లు జరగక రైతులు ఆందోళన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో అవగాహన లోపం, నిర్లక్ష్యం, వేగంగా పూర్తిచేయాలన్న ఆలోచనలే ఈ తప్పిదాలకు కారణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నా.. ఇంతవరకు సరిచేసిన పరిస్థితులు లేవని వాపోతున్నారు. సర్వే పూర్తయిన భూములకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేపడతామని ప్రకటించినా.. ఎక్కడా అమలుకాలేదని రైతులు పేర్కొంటున్నారు. అలాగే గ్రామాల్లో రీ సర్వే చేసిన వెంటనే రైతులు పొలం నాలుగు మూలలా సర్వే రాళ్లు పాతాలి. కానీ ఎక్కడా పూర్తిస్థాయిలో రాళ్లు పాతిన దాఖలాలు లేవు. సర్వేరాళ్లను రోడ్డు, పొలం గట్ల పక్కనే వదిలేశారు. ఒక్కో సర్వేరాయి కోసం రూ.500 ఖర్చు చేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కానీ, దీనికి లెక్కలు లేని పరిస్థితి కనిపిస్తోంది.

నెట్‌వర్క్ సమస్య..

నెట్‌వర్క్ లేని గ్రామాల్లో మాత్రమే భూముల రీ సర్వే ప్రక్రియ పెండింగ్ ఉంది. మిగిలిన గ్రామాల్లో సర్వే చేసి.. రాళ్లు హద్దులు వేశాం. ప్రస్తుతం ఎన్నికల్లో విధుల్లో అధికారులంతా నిమగ్నం కావడంతో సర్వే ప్రక్రియ నిలుపుదల చేశాం.

- చలపతిరావు, సర్వేయర్, మెళియాపుట్టి



మెళియాపుట్టిలో సర్వే చేస్తున్న దృశ్యం(ఫైల్)





నాథపుట్టుగ, గొప్పిలిలో వృథాగా ఉన్న సర్వే రాళ్లు

'పోలింగ్' రెమ్యునరేషన్ సరిచేయాలి

గుజరాతీపేట, మే 20: పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారులకు రెమ్యునరేషన్ సరిచేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌ను కలిసి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో.. పోలింగ్ అధికారులుగా పాల్గొన్న ఉపాధ్యాయులు వివిధ సవాళ్లను ఎదుర్కొని విజయవంతంగా ప్రక్రియ పూర్తిచేశామన్నారు. నిబంధనల ప్రకారం వేసవి సెలవుల్లో పోలింగ్ విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ సర్వీసు కోసం ఆర్జిత సెలవులకు అర్హులని తెలిపారు. మూడు రోజుల పోలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. పీవో, ఏపీవో రెమ్యునరేషన్ సరిపోయినప్పటికీ.. ఇతర జిల్లాతో పోలిస్తే తక్కువేనన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, కార్యదర్శి చావలి శ్రీనివాస్, నాయకులు ఎస్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ సంస్థ జిల్లా నోడల్ అధికారిగా ఏఎస్పీ

శ్రీకాకుళం అర్బన్, మే 20: ఏఎస్పీ(క్రైం) వి.ఉమామహేశ్వరరావును రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ నియమావళి అమలు పరిచేందుకు జిల్లా నోడల్ అధికారిగా నియమిస్తున్నట్టు ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జంతువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు చెక్‌పోస్టుల విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. జంతువుల అక్రమ రవాణా జరిగితే 63099 90803 ఫోన్ నెంబరుకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.



ఏఎస్పీ ఉమామహేశ్వరరావు

ఈ పాపం.. వైసీపీదే

- నదుల అనుసంధానానికి మంగళం
- టెండర్లు రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కూటమి అధికారంలోకి వస్తేనే..

కల నెరవేరుతుందని రైతుల ఆశ

(టెక్కలి)

వంశధార, బాహుదా నదుల అనుసంధానం కలగానే మిగిలింది. ఈ నదులు అనుసంధానం చేసి జిల్లాలో లక్షా 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలని టీడీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావించారు. రూ.6,400కోట్లుతో 2019 మార్చి నెలలో టెండర్ల ప్రక్రియ చేపట్టారు. అప్పట్లో బీఎస్ఆర్ కనస్ట్రక్షన్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. అందులో భాగంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వీటి ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించి రూ.5కోట్లు నిధులను సైతం కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే... టీడీపీ హయాంలో 25శాతం లోపల జరిగిన పనులన్నీ రద్దు చేసింది. దీంతో వంశధార, బాహుదా నదుల అనుసంధానం కథ కంచికి చేరింది. ఏటా సుమారు 200 టీఎంసీల నీరు వంశధార నది ద్వారా సముద్రంలో వృథాగా కలుస్తోంది. దీంతో ఇంటర్ లింకింగ్ ద్వారా తక్కువ నీటివనరులు గల బాహుదా నదికి వంశధారను అనుసంధానం చేయాలనే ప్రయత్నాలను వైసీపీ ప్రభుత్వం నీటిపాలు చేసింది. వంశధార, బాహుదా నదులు అనుసంధానం చేస్తే.. పాతపట్నం, మెళియాపుట్టి, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో సుమారు లక్షా50వేల ఎకరాలకు సాగునీరందేది. ఈ నదులను అనుసంధానం చేయాలని పలాస, టెక్కలి డివిజన్ల ప్రజాప్రతినిధులు కొన్ని దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు స్పందించి 2018లో రూ.6,400 కోట్ల నిధులు కేటాయించారు. నదుల అనుసంధానం జరుగుతుందని ఈ ప్రాంత రైతులు ఎంతో సంబరపడ్డారు. కానీ ఇంతల్లో సార్వత్రిక ఎన్నికలు రాగా.. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు జల్లింది. ఈ ఐదేళ్ల నదుల అనుసంధానం ఊసే లేదు. పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధులు కూడా దీనిపై నోరుమెదపలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఇటీవల పాతపట్నం ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార, బాహుదా నదుల అనుసంధానానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. టెక్కలి, పలాస డివిజన్ రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తేనే.. తమ కల నెరవేరుతుందని భావిస్తున్నారు.



వంశధార నుంచి వృథాగా పోతున్న నీరు(ఫైల్)



గొట్టిపల్లి వృద్ధాశ్రమం వద్ద.. ప్రభుత్వ గోర్జిని చదును చేసి వేసిన లేఅవుట్

'పేట'లో అక్రమ లేఅవుట్లు

- నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- నష్టపోతున్న కొనుగోలుదారులు

(నరసన్నపేట)

నరసన్నపేట పట్నం పరిసర ప్రాంతాల్లో జోరుగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. కరగాం, బొరిగివలస, కోమర్తి, గొట్టిపల్లి, జమ్ము, తామరాపల్లి, దేవాది పంచాయతీలతో పాటు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో అక్రమ వెంచర్లు వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ వెంచర్లు వేసినా.. పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. నరసన్నపేట మండలంలో సుడా అనుమతితో లే అవుట్లు ఏర్పాటు చేయాలి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. రెండు, మూడు ఎకరాల్లో చిన్నచిన్న లేఅవుట్లు వేసి.. భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వెంచర్లు వద్ద పాఠశాలకు, పార్కు, సామాజిక భవనం తదితర అవసరాలకు 20శాతం నుంచి 40శాతం వరకు స్థలాన్ని కేటాయించాలి. 40అడుగుల మేర రోడ్లను ఏర్పాటు చేయాలి. ఇవి రికార్డుల్లో ఉన్నట్లు చూపించి క్షేత్రస్థాయిలో మాత్రం ఆ స్థలాలను కూడా రూ.లక్షల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ప్రభుత్వానికి పన్ను చెల్లించకపోవడంతో భవిష్యత్‌లో కొనుగోలుదారులకు నష్టం తప్పదని పలువురు పేర్కొంటున్నారు.

సగం జిరాయితీ.. మరో సగం పోరంబోకు..

డీ పట్టా, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ లే అవుట్లు వేస్తున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువగా కొనుగోలు చేసి.. పక్కనే ఉన్న జిరాయితీ పొలాన్ని కూడా అందులో కలిపేస్తున్నారు. అంతా ఒకే సర్వేనెంబర్‌లో ఉన్నట్లు ప్లాన్‌లో చూపి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

- గొట్టిపల్లి పంచాయతీలో వృద్ధాశ్రమానికి సమీపాన ఓ లే అవుట్‌లో సుమారు ఎకరా స్థలం వరకు బంది గోర్జను ఆక్రమించారు. ఈ లే అవుట్‌ను ఒక మార్కెటింగ్ కంపెనీ జిరాయితీ భూమిగా తప్పుడు పత్రాలను చూపించి వినియోగదారులకు అంటకడుతున్నారు. అక్కడే ఉన్న కొండను సైతం కూడా చదును చేసి లే అవుట్‌లో కలిపారని విమర్శలున్నాయి.
- గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలోని జమ్ము సమీపంలో వేసే లే అవుట్‌లో పోరంబోకు స్థలాన్ని చదును చేసి వాటిని జిరాయితీ అని చూపించి విక్రయిస్తున్నారు.
- బొరిగివలస రెవెన్యూ పరిధిలో వెంకన్న చెరువు భూగర్భాన్ని ఆక్రమించి ప్లాట్లు వేశారు.
- గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలోని జమ్ము జంక్షన్ వద్ద వంశధార కాలువ స్థలాన్ని అక్రమించి లే అవుట్ వేసి విక్రయించారు. ఇలా పట్టణ పరిధిలో గల పలు గ్రామాల్లో రియల్‌ఎస్టేట్ దందా సాగుతోంది.
- పట్టణ పరిసరాల్లో కాస్త తక్కువ ధరకు ప్లాట్లు లభ్యమవుతున్నాయనే ఉద్దేశంతో వినియోగదారులు స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. భవిష్యత్‌లో భూమి ధరలు పెరుగుతాయని భావించి.. కొంతమంది లేఅవుట్లపై పెట్టుబడి పెడుతున్నారు. కాగా.. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ల వేసి.. విక్రయించడంతో కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.
- ఈ విషయంపై తహసీల్దార్ కనకరావు వద్ద ప్రస్తావించగా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ లేవుట్లు వేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సుడా అనుమతి, తదితర విషయాలు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

ఒకే ఈతలో 4 దూడలు



జలుమూరు మండలం పెద్దదూగాంలో గుండ సింహాచలానికి చెందిన ఆవు సోమవారం ఒకే ఈతలో నాలుగు దూడలకు జన్మనిచ్చింది. ఇందులో రెండు మగ, రెండు ఆడ దూడలు ఉన్నాయి. పుట్టిన కొద్దిసేపటికే ఒక్కో మగ, ఆడ దూడ చనిపోయాయి. మిగిలిన రెండు దూడలు ఆరోగ్యంగానే ఉన్నాయని సింహాచలం తెలిపారు. నాలుగు దూడలు జన్మించడంతో ఎంతో సంబరపడ్డానని.. వాటిలో రెండు చనిపోవడం దురదృష్టకరమన్నారు.

- జలుమూరు

ఇసుక అక్రమ రవాణా నియంత్రించాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 20: ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను నియంత్రించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కిల్లిపాలెం, హయాతీనగరంలో ఇసుకరీచ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై వచ్చే ఫిర్యాదులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు.. జిల్లాస్థాయి ఇసుక కమిటీ డీఎల్ఎస్సీలో గల అధికారులు తనిఖీ, విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ వారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, డీపీవో, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఆర్డీవో, ఇరిగేషన్ ఈఈ, తహసీల్దారు పాల్గొన్నారు.

పది లారీల తరలింపు

ఆమదాలవలస: వంశధార నది చవ్వాకులపేట రేవు నుంచి ఇసుక అక్రమ తరలింపునకు సిద్ధమవుతున్నట్టు సీఐ వాయునందన్ దివాకర్‌కు సమాచారం అందింది. ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం వెళ్లే దారిలో పది లారీలు నిలిపి ఉన్నాయని తెలిసింది. ఈ మేరకు సోమవారం సీఐ, పోలీసులు, ఎస్ఈబీ అధికారులతో అక్కడకు చేరుకున్నారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన ప్రాంతానికి చేరువలో ఉన్న లారీలను తనిఖీ చేశారు. అవి ఖాళీగా ఉండడంతో.. డ్రైవర్లను ప్రశ్నించారు. కాగా.. రాత్రివేళ ఇసుక తరలిస్తారనే అనుమానంతో వాటిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోకి తరలించారు. దీనిపై విచారణ చేపడుతున్నట్టు సీఐ వాయునందన్ దివాకర్ తెలిపారు.



లారీల సిబ్బందిని ప్రశ్నిస్తున్న సీఐ వాయునందం దివాకర్





మద్యం మత్తులో సీహెచ్‌సీ సిబ్బందిపై దాడి

రణస్థలం మండలం కొండములగాం సీహెచ్‌సీ సిబ్బంది పై మద్యం మత్తులో ఇద్దరు యువకులు దాడి చేశారు. సోమవారం సాయంత్రం ఇద్దరు యువకులు కెల్ల నవీన్‌కుమార్, కెల్ల జగన్ చిన్నచిన్న దెబ్బలతో వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లారు. వైద్య సిబ్బంది చికిత్స చేస్తుండగా ఆ ఇద్దరు యువకులు.. తమ సెక్యూరిటీ సిబ్బంది సంతుపై దాడి చేసి, రికార్డులు ధ్వంసం చేశారని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ లలిత తెలిపారు. ఈమేరకు జేఆర్‌పురం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు.

- రణస్థలం

ఇండియా శ్రామిక మార్కెట్

(సోమవారం (20.5.24) దిక్సూచి తరువాయి)

ఉపాధి సంబంధిత సవాళ్లు

తక్కువ అవకాశాలు - ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కనిపించని మార్పు: అధికంగా నమోదవుతున్న ఆర్థిక వృద్ధిరేటు అదే స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించడంలో విఫలమవుతున్నది. సేవలరంగం సహాయంతో మూలధన సాంద్రత పద్ధతిలో ఆర్థికవృద్ధి జరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇందుకు విరుద్ధంగా అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామికరంగం సహాయంతో అధిక వృద్ధిని సాధించాయి. ఇది లేకపోవడం వల్ల భారత ఆర్థికవ్యవస్థ నిర్మాణంలో చెప్పుకోదగ్గ మార్పు రావడంలేదు.

అసమానతల శ్రామిక మార్కెట్-సాంకేతిక సవాళ్లు: నూతన సాంకేతిక పరిజ్ఞానం శ్రామిక మార్కెట్‌లో అనేక మార్పులు తెచ్చింది. మూలధన సాంద్రత ప్రక్రియ రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగా ఉద్యోగావకాశాల వృద్ధి తక్కువగా ఉంటున్నది. అధిక నైపుణ్యం అవసరమైన ఉద్యోగావకాశాలు పెరుగుతుండగా, తక్కువ నైపుణ్యం, నైపుణ్యం అవసరంలేని ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ప్రాంతాలు, సామాజిక వర్గాలు, లింగపరమైన, వృత్తులపరంగా శ్రామిక మార్కెట్‌లో పెద్ద ఎత్తున అసమానతలు పెరుగుతున్నాయి.

ప్రాంతీయ అసమానతలు: ప్రత్యేకించి యువతకు ఉపాధి అవకాశాల సృష్టిలో దేశంలో ప్రాంతీయపరంగా తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయి. తూర్పు, మధ్య భారతదేశంలో గల రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. తక్కువ తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. ఉన్నత విద్య అభ్యసించిన యువత శాతం తక్కువగా ఉంది. సంఘటితరంగ ఉద్యోగిత తక్కువగా ఉంది. ఉద్యోగంలో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేని యువత శాతం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ప్రాంతాల వారీగా ఉద్యోగితా విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని పై అసమానతలు సూచిస్తున్నాయి.

విద్య-నైపుణ్యం-ఉపాధి సవాళ్లు-సంక్షోభం: 2000-2022 మధ్యకాలంలో ఉన్నతవిద్య అభ్యసించిన వారిలో నిరుద్యోగ శాతం పెరిగింది. విద్యకు, ఉపాధికి అవసరమైన అధికస్థాయి నైపుణ్యానికి గల తేడాను ఈ పరిస్థితి చూపిస్తున్నది.

సాంకేతికతలో, పర్యావరణంలో మార్పులు: సాంకేతికరంగంలో వస్తున్న అనూహ్య మార్పులు శ్రామిక మార్కెట్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఉదాహరణకు సాంకేతికతలో వచ్చిన కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) కొత్త ఉపాధి అవకాశాలతోపాటు అనేక సవాళ్లను శ్రామిక మార్కెట్ ముందు పెట్టింది. అంతేకాకుండా పర్యావరణంలో వస్తున్న మార్పులు అసంఘటితరంగ కార్మికుల జీవితాలను వ్యతిరేకంగా ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ పర్యావరణ రక్షిత సుస్థిర వృద్ధి ప్రక్రియలో నూతన పర్యావరణ(గ్రీన్) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల(జీడబ్ల్యూ) కాలుష్యరహిత విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. సౌరశక్తి, వాయుశక్తి లాంటి పునఃవినియోగిత ఇంధన సృష్టి ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారు. ఈ ప్రక్రియలో 30,40,000(సత్వర, దీర్ఘకాలాల్లో) ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉంది. ఈవిధంగా సాంకేతికతలో, పర్యావరణంలో వస్తున్న మార్పులు సవాళ్లతోపాటు అవకాశాలను సృష్టిస్తున్నాయి.

యువత ఉపాధి సవాళ్లు: ఇండియాలో పనిచేయగల వయసు ఉన్నవారు 2011లో 59 శాతం ఉండగా 2021 నాటికి 63 శాతానికి పెరిగింది. రాబోయే 15 సంవత్సరాలు ఇదే పరిస్థితి స్థిరంగా ఉండనుంది. ఇండియా తన జనాభా నిధి(డెమోగ్రాఫిక్ డివిడెండ్)ని ఉపయోగించుకోవడంలో చివరిదశకు చేరింది. దేశం మొత్తం జనాభాలో యువత శాతం తగ్గడం ఆరంభమైనా అది ఇంకా 27 శాతం(దాదాపు 37 కోట్లు) ఉండటం, ఇతర దేశాలతో పోలిస్తే చాలా ఎక్కువనే చెప్పాలి.

యువ జనాభాలో తగ్గుతున్న శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి: యువ జనాభాలో 2000 సంవత్సరంలో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 54 శాతం ఉండగా 2022 నాటికి 44 శాతానికి తగ్గింది. యువత వయసు దశల ఆధారంగా(15-19, 20-24, 25-29) అది తీవ్రంగా తగ్గుతుండటం గమనార్హం. 2000, 2019 సంవత్సరాల మధ్య యువ కార్మికశక్తి, యువ జనాభా మధ్య నిష్పత్తి కూడా తగ్గిందని అంతర్జాతీయ కార్మిక సంస్థ వివరించింది.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

యువతలోనే ఎక్కువ నిరుద్యోగం: ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వయసు వారితో పోల్చితే మూడురెట్లు అధికంగా యువతలో నిరుద్యోగం ఉంది. ఇండియాలో కూడా ఇతర అధిక వయసు వారి కంటే యువతలో నిరుద్యోగం ఎక్కువగానే ఉంది. అంతేకాకుండా గత అనేక దశాబ్దాలుగా అది పెరుగుతూ ఉంది. ఇండియాలో యువతలో నిరుద్యోగం 2000 సంవత్సరంలో 5.6 శాతం ఉండగా, 2012లో 6.2 శాతం, 2018లో 18 శాతం, 2020లో 15.1 శాతంగా ఉంది.

చదువుకున్న యువతలో తీవ్ర నిరుద్యోగం: భారతీయ యువత ఉన్నతవిద్య అభ్యసిస్తున్నారు కానీ ఉద్యోగాల సృష్టి తగినంతగా జరగడం లేదని అంతర్జాతీయ కార్మికసంస్థ పేర్కొంది. నాలుగో తరగతి ఉద్యోగాల కోసం ఉన్నత విద్యావంతులు(పీహెచ్‌డీ, పీజీ, యూజీ కలిగినవారు) వేలు, లక్షలుగా దరఖాస్తు చేయడాన్ని ఇందుకు ఉదాహరణగా ఐఎల్‌ఓ పేర్కొంది. ఉత్తరప్రదేశ్ పోలీసుశాఖలో '62' ప్యూన్ ఉద్యోగాల కోసం 93 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 3,700 మంది డాక్టరేట్లు, 5,000 మంది గ్రాడ్యుయేట్స్, 28,000 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. ఉద్యోగానికి అవసరమైన విద్యార్హత కేవలం 'అయిదో తరగతి' కావడం గమనార్హం.

- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మరో గ్రూప్-డి ఉద్యోగ పరీక్షకు 55 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్యూన్, వాచ్‌మన్, గార్డెనర్ లాంటి ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిలో చాలామంది ఉన్నత విద్యావంతులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో 15 ప్యూన్, డ్రైవర్, వాచ్‌మన్ ఉద్యోగాలకు 11వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసిన వారిలో డాక్టరేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. 2022లో బిహార్‌లో 15వేల రైల్వే ఉద్యోగాలకు లక్షల కొద్దీ నిరుద్యోగులు బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి దరఖాస్తు చేసుకున్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో అక్రమాలకు పాల్పడిందని 2023 జనవరిలో భారీఎత్తున నిరుద్యోగులు రోడ్ల మీద కొచ్చారు. అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చెప్పుకుంటున్న గుజరాత్‌లో 2022 జనవరిలో పదో తరగతి అర్హతతో 3,400 ఉద్యోగాలకు ప్రకటన ఇస్తే 1,70,00 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.
- చదువుకున్న యువతలో నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో పై సంఘటనలు సూచిస్తున్నాయని అంతర్జాతీయ కార్మికసంస్థ రూపొందించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక-2024 పేర్కొంది.
- 2010-2019 మధ్యకాలంలో దక్షిణాసియాలోని యువతలో 29.2 శాతం ఉద్యోగాల్లో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేరని నివేదిక తెలిపింది. ఇండియా పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఇండియాలో మహిళల్లో ఈ పరిస్థితి పురుషుల కంటే ఎక్కువగా ఉంది.

శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో లింగపరమైన అసమానత: గడిచిన రెండు దశాబ్దాలుగా శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో తీవ్రమైన అసమానత అలాగే స్థిరంగా కొనసాగుతున్నది. 2022లో యువకుల్లో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 61.2 శాతం ఉండగా, యువతుల్లో కేవలం 21.7 శాతంగా ఉంది. గ్రామాలు, పట్టణాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. ఇది 'భారతీయ శ్రామిక మార్కెట్‌లో గల లింగపరమైన అసమానతలకు సూచిక'అని నివేదిక వ్యాఖ్యానించింది.

తక్కువ నాణ్యత గల ఉద్యోగాల్లో యువత: పెద్ద వయసు(30 సంవత్సరాలు, 30 సంవత్సరాల కంటే ఎక్కువ) వారితో పోలిస్తే యువత తక్కువ నాణ్యతతో కూడిన ఉద్యోగాల్లో ఎక్కువగా ఉన్నారు. యువత పారిశ్రామిక, సేవారంగాల్లో ఎక్కువగా ఉన్నప్పటికీ రోజువారీ ఉద్యోగాల్లో, ప్రతిఫలం చెల్లించని కుటుంబ సంబంధిత పరిశ్రమల్లో, తక్కువ ఆదాయంతో కూడిన స్వయంఉపాధిలో యువత ఎక్కువగా ఉన్నారు. తక్కువ వేతనం, తక్కువ ఆదాయం ఇచ్చే తక్కువ నైపుణ్యం అవసరమైన ఉపాధిలో లేదా అసలే నైపుణ్యం అవసరం లేని ఉపాధిలో యువత పెద్దవారి కంటే ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) న్యూఢిల్లీలోని మానవాభివృద్ధి సంస్థతో కలిసి తయారుచేసిన 2024 భారత ఉద్యోగస్థితి(ఇండియా ఎంప్లాయ్‌మెంట్) నివేదిక తెలిపింది.

- భారతదేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన నిరుద్యోగ సంక్షోభాన్ని ప్రత్యేకించి చదువుకున్న యువత నిరుద్యోగ స్థితిని ప్రాంతాల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, లింగపరంగా, వృత్తులపరంగా భారత శ్రామిక మార్కెట్‌లో అసమానతలను పై నివేదిక తేటతెల్లం చేసింది. అధిక 'ఆర్థిక వృద్ధిరేటు, అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడం సమస్యకు పరిష్కారం కాదు' అని కూడా నివేదిక సారాంశం. ప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాలు, లింగపరంగా, వివిధ రంగాలవారీగా ప్రత్యేక ఉపాధి వ్యూహ విధానాల అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి,
హైదరాబాద్.

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ- తెలంగాణ స్టేట్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ సీపీజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ మహిళ విశ్వ విద్యాలయం సహా కాకతీయ, ఉస్మానియా, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల క్యాంపస్‌లు, గుర్తింపు పొందిన పీజీ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ స్పెషలైజేషన్‌లు: యాన్షియంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, మరాఠీ, పర్షియన్, సంస్కృతం, తెలుగు, ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ, థియేటర్ ఆర్ట్స్, ఎకనామిక్స్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: జనరల్, ఐఎస్, ఈ కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్ అండ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అకౌంటింగ్.

- ఎంఈడీ, ఎంపీఈడీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బోటనీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫిజికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, జాగ్రఫీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, అప్లయిడ్ జియో కెమిస్ట్రీ, మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథ్స్ విత్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, జియో ఫిజిక్స్, నానో సైన్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, స్టాటిస్టిక్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, జువాలజీ, ఫిషరీస్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్స్, జెనెటిక్స్, మైక్రోబయాలజీ, ఫర్మంటేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, ఫుడ్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైకాలజీ, సెరికల్చర్, డేటా సైన్స్.

పీజీ డిప్లొమా

స్పెషలైజేషన్: చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు

- ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐంటిగ్రేటెడ్ ఎంబీఏ

అర్హత వివరాలు: ఎంఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యు, ఎంహెచ్ఆర్ఎం, ఎంటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ; ఎంఏ లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత లాంగ్వేజ్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. ఎంకాం కోర్సుల్లో ప్రవేశానికి బీకాం ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంఈడీలో ప్రవేశానికి బీఈడీ; ఎంపీఈడీలో ప్రవేశానికి బీపీఈడీ/ బీపీఈ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి.
- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సబ్జెక్టులతో బీఏ/బీఎస్సీ/బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సుకు బీటెక్(ఫుడ్ సైన్స్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ జియోఇన్ఫర్మాటిక్స్‌కు బీఈ/ బీటెక్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి డిగ్రీ(అగ్రికల్చర్/వెటర్నరీ సైన్స్/ఫార్మసీ/ఫిషరీస్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు బీఎస్సీ(ఎంఎల్‌టీ/ నర్సింగ్/ అగ్రికల్చర్/ హోం సైన్స్)/ బీఫార్మసీ/ బీఈ/ బీటెక్ అభ్యర్థులు అనర్హులు.
- పీజీ డిప్లొమా(ఫోరెన్సిక్ సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్సెస్)లో ప్రవేశానికి బీఎస్సీ(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌కు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చైల్డ్ సైకాలజీ స్పెషలైజేషన్‌కు డిగ్రీ స్థాయిలో సైకాలజీ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివిన మహిళలు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ)కి ఎంపీసీ/బైపీసీ/ఎంబైపీసీ గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐఎంబీఏలకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్‌లో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి.

సీపీజీఈటీ 2024 వివరాలు

- దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీ/ఎక్స్‌పరిమెంట్/థియరీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ(బయోకెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫోరెన్సిక్ సైన్స్/జెనెటిక్స్/మైక్రోబయాలజీ)కి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40, ఫిజిక్స్/ బోటనీ/జువాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, బయోటెక్నాలజీ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్యసమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **సీపీజీఈటీ 2024 తేదీలు:** జూలై 5 నుంచి
- **వెబ్‌సైట్:** cpget.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/EtCsnUxలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

పుట్టినరోజున కొత్త కబురు



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్, ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానిని దృష్టిలో ఉంచుకుని తన సినిమాల ఎంపిక ఎంతో కేర్ తీసుకుంటుంటారు ఎన్టీఆర్. ప్రస్తుతం అందరి దృష్టీ ఆయన చేస్తున్న 'దేవర', 'వార్ 2' చిత్రాల మీదే ఉంది. తాజాగా ఇప్పుడు మరో భారీ చిత్రాన్ని ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రకటించారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకుడు కావడం విశేషం. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఎన్టీఆర్ స్టార్ పవర్, ప్రశాంత్ నీల్ విజనరీతో రూపుదిద్దుకొనే ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కేజీఎఫ్'కు దీటుగా భారీ స్కేల్‌లో ఉంటూ ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తుందంటున్నారు నిర్మాతలు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర', 'వార్ 2' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేసి ఆగస్టు నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు.

మంచు మనోజ్ ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన ప్రతినాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తుండగా, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సోమవారం మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన



పవర్‌ఫుల్ అవతార్‌లో...

పాత్ర గ్లింప్స్‌ను 'ద బ్లాక్ స్వార్డ్' పేరుతో విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో ఆయన చాలా పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ "మిరాయ్' కథ విన్నప్పుడు అద్భుతంగా అనిపించింది. ఈ సినిమా రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. ఇంతటి చాలెంజింగ్ రోల్‌తో మళ్లీ ఇండస్ట్రీలో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ "ఈ సినిమాలో మనోజ్ భాగమవ్వటం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన కమ్‌బ్యాక్ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని చెప్పారు. పీరియాడికల్ సూపర్ హీరో ఫాంటసీగా తెరకెక్కుతున్న 'మిరాయ్' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2డి, 3డి వెర్షన్స్‌లో విడుదలవుతోంది.

పాత సినిమా.. కొత్త వివాదం



పాయల్ రాజ్‌పుత్ నాలుగేళ్ల క్రితం నటించిన 'రక్షణ' చిత్రం విషయంలో మొదలైన వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తనకు ఇవ్వాల్సిన డబ్బు చెల్లిస్తేనే సినిమా ప్రమోషన్స్‌కు వస్తానని పాయల్, ఆమె ప్రమోషన్స్‌కు వచ్చిన తర్వాతే డబ్బు ఇస్తానని దర్శకనిర్మాత ప్రణదీప్ ఠాకూర్.. అంటూ మెట్టు దిగక పోవడంతో వివాదం మరింత జటిలమైంది. ఈ విషయంలో ప్రణదీప్ ఠాకూర్ మార్చి 28న తెలుగు నిర్మాతలమండలిని ఆశ్రయించారు. 'పాయల్ రాజ్‌పుత్ మా సినిమా కోసం 50 కాల్షీట్లు ఇచ్చింది. అందులో 47 రోజులు వర్క్ చేసింది. మిగిలిన ఆ మూడు రోజులు ప్రమోషన్స్ కోసం రమ్మని అడుగుతుంటే ఆమె సహకరించడం లేదు' అని ఆయన తెలుగునిర్మాతలమండలికి ఫిర్యాదు చేశారు. పాయల్ రాజ్‌పుత్‌కు ఇవ్వాల్సిన రూ. ఆరు లక్షలు ఇవ్వడానికి తను సిద్ధమేనని ఆయన వెల్లడించారు. నిర్మాత ఫిర్యాదును తెలుగు నిర్మాతలమండలి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు పంపించింది. అయితే ఆమె అందులో సభ్యురాలు కాకపోవడంతో తమ పరిధిలో లేని వ్యవహారమని 'మా' స్పష్టం చేయడంతో ఈ వ్యవహారాన్ని ముంబైలో ఉన్న ఫిల్మ్ ఫెడరేషన్‌కు దృష్టికి తీసుకెళ్లింది తెలుగు నిర్మాతలమండలి. ఈ లోగానే 'నాకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా 'రక్షణ' చిత్ర నిర్మాత వేధిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి నన్ను బ్యాన్ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు' అంటూ పాయల్ రాజ్‌పుత్ రెండు రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా ఆరోపించి, వివాదాన్ని సరికొత్త మలుపు తిప్పారు. దీనిపై తెలుగు నిర్మాతలమండలి స్పందిస్తూ పాయల్‌ను బ్యాన్ చేసే ఆలోచన తమకి లేదని ఏ సమస్యనైనా శాంతియుతంగా పరిష్కరించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. తెలుగు నిర్మాతలమండలి జోక్యంతో పాయల్ కొంత దారికి వచ్చిందని చెప్పాలి. ఆమె స్వరం కూడా మారింది. వివాదం పెద్దగా చేయడం ఎందుకని ఆమె అనుకున్నారో ఏమో ఈ విషయంపై వివరణ ఇస్తూ గంటల వ్యవధిలోనే మరో పోస్టింగ్ పెట్టారు. 'రక్షణ' సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో తెలుసు. ఈ సినిమాకు పనిచేసిన వారెవరికీ నష్టాలు రాకూడదనేది నా తాపత్రయం. 2020లో ఈ సినిమాకు ఎలా సపోర్ట్ చేశానో ఇప్పుడూ అంతే సహకారం అందిస్తాను. నా విన్నపం ఒకటే.. నాతో సంప్రదింపులు జరిపాకే ఈ సినిమా విషయంలో ఎటువంటి నిర్ణయమైనా తీసుకోండి. నేను ఎవరికీ హాని తలపెట్టాలని చూడటం లేదు. చిత్ర బృందం నుంచి పిలుపు కోసం.. ఈ సమస్యను పరిష్కరించడానికి నా టీమ్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తోంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఆటోతో టుక్ టుక్



చిత్ర వాహినీ, ఆర్‌వైజీ సంస్థలు నిర్మిస్తున్న 'టుక్ టుక్' పోస్టర్‌ను విడుదల చేశారు. విచిత్రమైన ఆటోతో ఈ పోస్టర్ ఆకర్షణీయంగా ఉంది. సుప్రీత్ సి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరోలు హర్షరోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు ఓ ఆటో బొమ్మను ఆసక్తికరంగా చూస్తున్నారు. అసలు ఆ ఆటో బొమ్మ ఏమిటి, దానికీ, చిత్రకథకు ఉన్న సంబంధం ఏమిటి అనే అంశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని రాహుల్ రెడ్డి, లోక్కు, సాయివరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మించారు. ఈ సినిమాకు సంగీతం: సంతు ఓంకార్, ఫొటోగ్రఫీ: హార్దిక్ శ్రీకుమార్.

దీవిలో తుపాన్



ఇటీవల విడుదలైన 'లవ్‌గురు' చిత్రంతో విజయాన్ని అందుకొన్న తమిళ హీరో విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'తుపాన్'. విజయ్ ఆంటోనీతో ఇంతకుముందు 'రాఘవన్', 'హత్య' చిత్రాలను నిర్మించిన కమల్ బరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా ఈ సినిమాకు నిర్మాతలు. పోయెటిక్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా దీనిని దర్శకుడు విజయ్ మిల్లర్ రూపొందిస్తున్నారు. 'ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉంది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షూటింగ్ అండమాన్, డయ్యూ, డామన్‌లో జరిపాం. ఈ నెల 29న టీజర్ విడుదల చేసి, త్వరలోనే చిత్రాన్ని రిలీజ్ చేస్తాం' అని నిర్మాతలు చెప్పారు.

ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా

రచయిత విజయేంద్ర ప్రసాద్



'బేబి'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటించిన చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించారు. కేదార్ శెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించారు. మే 31న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. సోమవారం ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. సినిమా దర్శకుడు ఉదయ్ శెట్టి మాట్లాడుతూ "వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమాని రూపొందించాం. వినోదంతో పాటు ఇందులోని ట్విస్ట్‌లు, థ్రిల్‌లు ఆకట్టుకుంటాయి" అని అన్నారు. "నేను ఇప్పటిదాకా రియలిస్టిక్ పాత్రలు పోషించాను. ఈ సినిమాలో నా పాత్ర ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఇది టిపికల్ క్రైమ్ కామెడీ జానర్" అని ఆనంద్ దేవరకొండ అన్నారు. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యూయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ నిర్మాత: అనురాగ్ పర్వతనేని.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XKJOAG0 లో చదవండి.

ఏకగ్రీవ పంచాయతీ నిధులు విడుదల చేయండి

గంగివలస(పోలాకి): మండలంలోని పోలాకి, ఈదులవలస, గంగివలస పంచాయతీలు ఏకగ్రీవమైనా ఇంత వరకు గంగివలస పంచాయతీకి నిధులు విడుదల చేయలేదని సర్పంచ్ బంకా చక్రధర్ తెలిపారు. మిగిలిన పంచాయతీలకు నిధులు విడుదల చేసి మా పంచాయతీకే ఇవ్వక పోవడం దారుణమన్నారు. నిధులు లేక పనులు చేపట్టేందుకు ఇబ్బందిపడుతున్నామన్నారు. పదవీకాలం ముగిసి పోతున్నా నిధులు మంజూరు కాక పోవడం విచారకరమన్నారు. దీనిపై డీపీవోకు లేఖ రాశామన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో ఉషశ్రీ వద్ద ప్రస్తావించగా గంగి వలసకు నిధులు విడుదల కాలేదన్నారు. నిధులు విడుదల చేయాలని మండల పంచాయతీ అధికారి బి.పద్మావతికి సర్పంచ్ వినతిపత్రంలో కోరారని తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

నందిగాం: నందిగాం శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభిం చారు. గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ శిబిరం ఉద్దేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా జూనియర్, సీనియర్ విభాగాల్లో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. జూన్ 7 వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని వినియోగించుకోవాలని కోరారు. ● **నరసన్నపేట:** పిల్లలు పుస్తకం పఠనం అలవర్చు కోవడం ద్వారా ఎంతో విజ్ఞానం సంపాదించవచ్చని గ్రంథాలయాధికారి చాయరతన్ అన్నారు. సోమవారం వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా విద్యార్థులకు బాల సాహిత్యం, పొడుపు కథలపై పోటీలు నిర్వహించారు. చిన్నారులు, పాఠకులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీ అభ్యర్థి హౌస్ అరెస్టు

నందిగాం: కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ చిన్నవెంకటాపురంలో జరిగిన గొడవలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన తోట మల్లేసు అంతిమ యాత్ర, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళుతున్న శ్రీకాకుళం పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను కణితివూరులో సోమవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఎస్ఐ మహ్మద్ అమీర్ అలీ సిబ్బంది, స్పెషల్ పార్టీ బృందం ఆయనను ఇంటిలో నిర్బంధించారు.

దుర్గంధం

● దుర్వాసన వెదజల్లుతున్న వీధులు
● వారాల తరబడి ఇదే పరిస్థితి ● ఇబ్బందులుపడుతున్న ప్రజలు
● పట్టించుకోని మునిసిపాలిటీ, పంచాయతీల అధికారులు

ఏ వీధి చూసినా.. ఏ గ్రామం చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. వారాలు, నెలల తరబడి చెత్తను తొలగించకపోవడంతో ప్రజలు దుర్గంధంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రతిరోజూ ఉత్పత్తి అయిన చెత్తను డంపింగ్‌యార్డ్‌లకు తరలించాల్సి ఉన్నా ఆ దిశగా మునిసి పాలిటీ శానిటేషన్, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి. పలాస మునిసిపాలిటీలో నెలరోజుల కిందట తడి, పొడి చెత్త సేకరణకు డబ్బాలు ఏర్పాటు చేసినా అది అక్కడితోనే నిలిచి పోయింది. దీంతో చెత్తతో డబ్బాలు నిండి రోడ్డుపై పడి పందులు, కుక్కలు పాడు చేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పలు పంచాయతీల్లోని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా మునిసిపాలిటీ, పంచాయతీల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. -పలాస/పలాస రూరల్/జలుమూరు


పలాస నెహ్రూనగర్‌లో వ్యర్థాలను తింటున్న పశువులు


పలాస రూరల్: బ్రాహ్మణతర్లా ఇందిరాకాలనీ వద్ద..


జలుమూరు: చల్లవానిపేట కూడలిలో..


పలాస ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే దారిలో


పలాస సత్యసాయి మందిరం రోడ్డులో..


నీలావతి గ్రామంలో..

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

టెక్కలి: టెక్కలి హెడ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని హెడ్ పోస్ట్‌మాస్టర్ ఎస్.భానూజీరావు, సహాయ సూపరింటెండెంట్ ప్రతాప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లలోపు బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, మహిళలకు మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ ఖాతాలు, అలాగే సేవింగ్‌బ్యాంక్, ఆర్డీ, టీడీ, ఎస్ ఎస్‌సీ, కేవీపీ, పీపీఎఫ్, బీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, జేపీపీబీ తదితర సేవలు అందుబాటులో ఉన్నా యన్నారు. రామజన్మభూమి సావనీర్ అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుక

పలాస: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు సోమవారం నిర్వహించారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీతారామాలయంలో పేదలకు అన్నదానం చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో తారక్ ట్రస్టు సభ్యులు తమ్మినేని శంకర్, సూర్యప్రకాష్, దుర్గాప్రసాద్, భాస్కర్, రాజశేఖర్, అభి, శ్రీరామ్, మణి, స్వామి పాల్గొన్నారు.

'చేయూత' అందక మహిళల ఆందోళన

పోలాకి: చేయూత పథకం ద్వారా మహిళలకు జగన్ ప్రభుత్వం నాలుగో విడతగా చెల్లించాల్సిన నిధులు ఇంతవరకు మా బ్యాంక్ ఖాతాల్లో జమకాలేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్, వెలుగు, బ్యాంక్‌లకు వెళ్లి నిధుల కోసం ఆరా తీశారు. అయితే నిధులు జమ కాలేదని అధికారులు తెలిపారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం జగన్ మూడునెలల కిందట బటన్ నొక్కినా ఇంతవరకు మాకు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదని వారు వాపోయారు. ఈ విషయాన్ని ఎంపీడీవో ఉషశ్రీ, సూపరింటెండెంట్ బలగ ప్రకాశ్ వద్ద ప్రస్తావించగా నిధులు త్వరలో జమవుతాయని, లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు

దీర్ఘాశి(పోలాకి): రైతులకు రాయితీ ధరలపై జీలుగు, జనము, పిల్లిపెసర విత్తనాలు రైతు భరోసా కేంద్రం ద్వారా అందజేస్తున్నామని దీర్ఘాశి ఆర్బీకే నిర్వాహకురాలు మెండ ఇందిర తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు తీసుకు వచ్చి పేరు నమోదు చేసుకోవాలన్నారు. విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జీలుగు విత్తనాలు పది కిలోలు రూ.440, కట్టె జనుము పది కిలోలు రూ.440, పిల్లిపెసర 8 కిలోలు రూ.536 చెల్లించి పొందవ చ్చన్నారు. అలాగే రైతులు ఖరీఫ్ వరి విత్తనాల కోసం ఆర్బీకేలో సంప్రదించాలన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి: మండలంలోని రుంకు గ్రామానికి చెందిన బారికవాడు ఇటీవల ప్రమాదంలో గాయపడడంతో అదే గ్రామానికి చెందిన జై హనుమాన్ సేవా సంఘం ప్రతినిధులు రూ.91,700 నగదును సోమవారం అందించారు. కార్యక్రమంలో పోలాకి కృష్ణమూర్తి, టంకాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విడిగా పెట్రోల్ అమ్మితే చర్యలు

వజ్రపుకొత్తూరు: పెట్రోల్‌బంక్‌లలో వాహనాలకు కాకుండా విడిగా పెట్రోల్ అమ్మితే చర్యలు తప్పవని ఎస్ఐ సీహెచ్ రామారావు స్పష్టం చేశారు. ఈ మేరకు బంక్‌లకు సోమవారం నోటీసులిచ్చామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలులో ఉన్నందున బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్ పోయరాదన్నారు.పెట్రోల్ బంక్‌లలో కాకుండా బయట పాన్‌షాప్‌లు, ఇతర దుకాణాల్లో పెట్రోల్ విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పలాసరూరల్: పలాస మండలం, పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో ఉన్న పెట్రోల్ బంక్‌ల్లో సీసాలు, క్యాన్లకు లూజుగా పెట్రోల్ విక్రయిస్తే చర్య లు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులిచ్చారన్నారు. సోమవారం పెట్రోల్ బంకులను పరిశీలించి యాజ మాన్యాలకు సూచనలిచ్చారు.

మందస: మందస, హరిపురం, బిన్నలలోని పెట్రోల్ బంక్‌ల్లో సీసాలు, క్యాన్లలో లూజుగా పెట్రోల్ అమ్మకాలు చేపట్టరాదని తహసీల్దార్ ఎస్. తిరుమలరావు సంబంధిత యాజమాన్యాలకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటువంటి అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం పెట్రోల్ బంక్‌లను పరిశీలించి తగు సూచనలిచ్చారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

ఎల్.ఎన్.పేట: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధి నిర్వహణలో సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.గిరిబాల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాల న్నారు. విధులను సక్రమంగా నిర్వహిం చాలని, గ్రామస్థుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని, పంచాయతీ అభివృద్ధి పనులు చేసేందుకు ఆర్థిక పరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ ఆటలపై శిక్షణ

సంతబొమ్మాళి: దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి వినోదంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు సంప్రదాయ ఆటలపై శిక్షణ ఇస్తున్నారు. అంతరించు పోతున్న సంప్రదాయ ఆటలైన కర్ర-బిళ్ల, గోలీ ఆట, జోరాబాల్, పెంకులాట, బచ్చాట, అష్టా-చమ్మా, పులి-మేక, దాడి ఆట, గుంటాట, మండాట, గుడుగుడు గుంచం, పిచ్చుక గూళ్లు తదితర ఆటలను ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణ ఇస్తున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతిరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, ఆదికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తేనే గుర్తింపు

జలుమూరు (సారవకోట): క్రీడల్లో రాణించిననాడే గుర్తింపు వస్తుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. జగన్నాథ పురంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుం దన్నారు. క్రీడాకారులు సోదర భావంతో మెలగాలన్నారు. టోర్నమెంటులో 36 జట్లు పాల్గొనడం ఆనందదాయకమన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వాబ యోగి

తిరుపతి గంగమ్మ జాతరలో తప్పెటగుళ్ల ప్రదర్శన

పలాసరూరల్: చిత్తూరు జిల్లా తిరుపతిలో మూడురోజులుగా జరుగుతున్న గంగమ్మ జాతరలో పలాస మండలం రేగులపాడుకు చెందిన పీత గంగయ్య బృందం తప్పెటగుళ్ల ప్రదర్శన చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారులు వివిధ ప్రదర్శనలు చేపట్టగా శ్రీకాకుళం జిల్లా నుంచి గంగయ్య బృందానికి అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా తప్పెటగుళ్ల కళాకారులను పలువురు అభినందించారు.


తిరుపతి గంగమ్మ జాతరలో తప్పెటగుళ్ల ప్రదర్శన ఇస్తున్న పీత గంగయ్య బృందం

దివ్యాంగ పిల్లలు సర్వే పారదర్శకంగా చేపట్టాలి

జలుమూరు: బడి బయట ఉన్న దివ్యాంగ పిల్లల సర్వే పారదర్శకంగా చేపట్టాలని జిల్లా సహిత విద్య విభాగం కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు అన్నారు. జలుమూరులో సర్వేను సోమవారం పరిశీలించారు. బడి బయట ఉన్న 18 ఏళ్లలోపు వయసు ఉన్న వివిధ రకాల వైకల్యం ఉన్న పిల్లలను గుర్తించి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, సహిత విద్య సహాయ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, సహిత ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

హిరమండలం: మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తిస్తున్నట్లు ఎంఈవో రాంబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీడబ్ల్యూఎస్ఎన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించి భవిత పాఠశాలల్లో చేర్పించి ఫిజియోథెరపీ చేయడం జరుగుతుందన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

టెక్కలి: చాకిపల్లి, కె.కొత్తూరు గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సోమవారం డీఎల్పీవో ఐవీ రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి చెత్త, పొడి చెత్త వేరుచేయడం, తడిచెత్త నుంచి ఎరువు తయారీ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు, రీసోర్స్‌పర్సన్ పేడాడ ఆనందరావు, కార్యదర్శులు రమేష్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


ఎరువు తయారీని పరిశీలిస్తున్న డీఎల్పీవో

మోహనరావుకు పురస్కారం

నందిగాం: నరేంద్రపురం మాజీసర్పంచ్ జీరు మోహనరావుకు తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ పురస్కారాన్ని ఆదివారం రాత్రి అందించారు. రంగస్థల, పౌరాణిక, భజన, సేవా కార్యక్రమాల్లో రాణిస్తున్న మోహనరావును ఉగాది ఉత్సవాలు-2024కి ఎంపిక చేశారు. ఈ మేరకు ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పోలోజు రాజకుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఎ.భాస్కర రావు ఆచార్యులు, జాతీయ సమన్వయకర్త ఎం.ప్రదీప్‌కుమార్, జాతీయ అధ్యక్షుడు ఆర్.రమేష్ దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మోహనరావును మండలానికి చెందిన పలువురు కళాకారులు అభినందించారు.



మోహనరావును సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఆదిశేష వాహనంపై శ్రీనివాసుడు

నరసన్నపేట: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆల యంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీనివాసుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆదిశేష వాహనంపై శ్రీని వాసుడు విహరించారు. వేదమంత్రాల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి ఉదయం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించిన అనంతరం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. పల్లకి సేవతో పాటు హోమాలను రుత్వికులు చేప ట్టారు. పట్టణంలోని కలివరపుపేట, పెద్దపేట, తిరుమలవీధి తదితర వీధుల్లో స్వామి తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల కూచిపూడి, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీ వేంకటేశ్వర స్వామి అమృత లీలలపై ప్రవచనం చేశారు.


నరసన్నపేట: ఆది శేషవాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత బంగారు సంతోషిమాత ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూలతో అలంకరించిన కలశాలు పట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వచ్చి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

కన్నుల పండువగా లక్ష్మీనారాయణ కల్యాణం

సంతబొమ్మాళి: నౌపడలో సోమవారం లక్ష్మీనారాయణ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి వేదపండితుడు నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో భాస్కర దాస్ దంపతులు కల్యాణం చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం చేశారు.


సంతబొమ్మాళి: తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహ పారాయణం

టెక్కలి: టెక్కలి బెహరా వీధిలో చంద్రశేఖర స్వామి ఆల య ప్రాంగణంలో రాధాకృష్ణ సంకీర్తన ప్రేమమండలి ఆధ్వర్యంలో సోమవారం భాగవత సప్తాహ పారాయణం సోమ వారం నిర్వహించారు. అష్టప్రహరీ హరినామ సంకీర్తన చేప ట్టారు. మహంత్ మదన్‌గోపాల్‌దాస్‌జీ మహరాజ్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం జగన్నాథ స్వామిని పట్టణంలో ఊరేగించారు.


టెక్కలి: జగన్నాథ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

పలాస: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లారని, ఈ అంశాలు టీడీపీ విజయానికి దోహదం చేస్తాయని పలువురు నేతలు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తిని భవిష్యత్‌లో కొనసాగించాలన్నారు. రెండు నెలల పాటు కార్యకర్తలు చేసిన కృషి ప్రశంసనీయమని, భవిష్యత్ టీడీపీదేనని, అన్ని రంగాల్లో యువతకు ప్రాధాన్యం ఇచ్చే దిశలో టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే గ్రామాల్లో అభివృద్ధి చేసేందుకు అందరూ సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, మందస మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, సీనియర్ నాయ కులు గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, టంకాల రవిశంకర్‌గుప్తా, యవ్వారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్

ప్రజా ఉద్యమ నేత సుందరయ్య

హరిపురం: కార్మిక వర్గాల పక్షపాతి, ప్రజా ఉద్యమ నేత సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోనారి మోహనరావు అన్నారు. బైరి సారంగపురం కార్మిక భవనంలో సోమవారం సుందరయ్య వర్థం తిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటాల్లో సుందరయ్య పాల్గొని స్ఫూర్తిగా నిలిచా రన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, యం. ధర్మారావు, కె.కేశవరావు, ఆర్.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నేతలు

చల్లబడ్డ వాతావరణం

పలాసరూరల్: పదిరోజులుగా వడగాల్పులు, ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కురిసిన వర్షానికి ఒక్కసారి ఉపశమనం కలిగింది. గంటపాటు ఉరు ములు, మెరుపులతో పాటు వడగళ్ల వాన కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వడగాల్పులతో బయటకు రాలేని ప్రజానీక రాత్రి కురిసిన వర్షంతో కాస్త ఊరట పొందారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో భూమి చల్లబడడంతో నీటి ఇబ్బందులు తగ్గుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మార్సీలో పాము కలకలం

నందిగాం: నందిగాం ఎమ్మార్సీ భవనంలో సోమ వారం పాము కలకలం రేపింది. ఉదయం సిబ్బంది విధులకు హాజరవుతున్న సమయంలో మెయిన్‌హాల్ నుంచి కంప్యూటర్ గదిలోకి పాము వెళ్లడంతో సిబ్బంది చూసి భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో కంప్యూటర్‌ను మెయిన్ హాల్‌కు తీసుకు వచ్చి విధులు నిర్వహించారు. పాము ఎటు వెళ్లిందో తెలియక సాయంత్రం వరకు ఆందోళన చెందారు.



క్షణికావేశంలో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



గోవింద(ఫైల్)

పాతపట్నం: కోదూరు గ్రామానికి చెందిన పాతూరు గోవింద(27) అనే ట్రాక్టర్ డ్రైవర్ భార్యతో గొడవపడి క్షణికావేశంలో ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోవింద మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో అతడి భార్య వనితారాణి అదే గ్రామంలో ఉన్న ఆమె కన్నవారి ఇంటికి పిల్లలు దర్శిని, అభిరాంలను తీసుకుని వెళ్లింది. దీంతో ఆది వారం రాత్రి కూడా భార్యతో గొడవపడి తన ఇంటికి వచ్చి తలుపులు వేసుకున్నాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో అతడి అన్నయ్య రామచంద్ర బలవంతంగా తలుపు తెరిచిచూడగా బెడ్‌షీట్‌తో ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే కిందకి దించి ఆటోపై స్థానిక సీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గోవింద తల్లి చిన్నమ్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బైక్ టైరు పంక్చర్.. జిల్లా యువకుడి మృతి

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం అమటాం రాయవలస వద్ద బైక్ టైరు పంక్చరై జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి భోగాపురం సీఐ ఎ.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం మేఘవరం గ్రామానికి చెందిన లోపింటి సంతోష్‌కుమార్ (31) విశాఖ పోర్టులో పనిచేస్తూ కుటుంబంతో కలిసి మల్కాపురంలో నివాసముంటున్నాడు. టెక్కలిలో ఉన్న బంధువులు మృతి చెందడంతో వారిని పరామర్శించేందుకు ఆదివారం ఉదయం తన తల్లి లక్ష్మితో కలిసి స్కూటీపై బయలుదేరాడు. ఈ క్రమంలో అమటాంరాయవలస సమీపానికి వచ్చే సరికి స్కూటీ టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో సంతోష్‌కుమార్ తలకు బలమైన గాయం కాగా, తల్లి లక్ష్మి గాయపడింది. వీరిని చికిత్స నిమిత్తం 108లో తగరపువలస సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్‌కుమార్ ఆదివారం రాత్రి మృతి చెందాడు. గాయపడిన తల్లి లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవికుమార్ తెలిపారు. సంతోష్‌కుమార్‌కు ఏడాది కిందటే వివాహం కాగా, వీరికి మూడు నెలల వయస్సు గల కుమార్తె ఉంది.

గాయపడిన మహిళ..



గన్నెమ్మ(ఫైల్)

రణస్థలం: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన కొయ్యాన గన్నెమ్మ (72) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 16న గన్నెమ్మ షర్డీ సాయి ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా విశాఖ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన గన్నెమ్మను చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా, సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. గన్నెమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవయవ దాతకు కన్నీటి వీడ్కోలు



సుశీల అంతిమ యాత్ర



సుశీల(ఫైల్)

గార: కళింగపట్నం గ్రామ సచివాలయం మహిళా పోలీసుగా విధులు నిర్వహించిన కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన పుక్కళ్ల సుశీల(30) ఈ నెల 18న జరిగిన రోడ్డు ప్ర మాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో ఆమె అవయవాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ క్రమంలో ఆమె పార్థీవ దేహానికి సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. కళింగపట్నం నుంచి వాడపాలెం, మత్స్యలేశం మీదుగా జరిగిన సుశీల అంతిమయాత్రలో భారీగా ప్రజలు పాల్గొని కన్నీట పర్యంతమయ్యారు. సుశీల తల్లితండ్రులు గోవిందరావు, జ్యోతి, కుటుంబ సభ్యులతో పాటు వేలాది మంది నివాళులర్పించారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని పాత్రలోవ, నేరల్లోవ గ్రామాల్లో సోమవారం సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 1300 లీటర్ల బెల్ల ఊటలను ధ్వంసం చేసినట్లు పాతపట్నం సీఐ నల్లి సాయి, ఎస్ఈబీ సీఐ రామచంద్ర కుమార్ తెలిపారు. అలాగే 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకు న్నామ న్నారు. ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



సూర్యనారాయణ

జలుమూరు: కూనలచ్చన్నాయుడుపేటకి చెందిన ఉప్పాడ సూర్యనారాయణ (సూర్యం) (58) 5 రోజుల నుంచి కనిపించడం లేదని ఆతని కుమార్తె కొత్తకోట ఉమ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 16న నారాయణవలస సంతకు వెళతానని బయటకు వెళ్లిన సూర్యనారాయణ తిరిగి ఇంటికి చేరలేదన్నారు. బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉంటాడని గాలించామని అయితే ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దూసుకుపోయిన పోర్టు వాహనం.. తప్పిన ప్రమాదం



ధ్వంసమైన షెడ్డు

సంతబొమ్మాళి: నౌపడ పంచాయితీ కుర్మనాథపురం వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. మూలపేట పోర్టు నుంచి టెక్కలికి వేగంగా వెళుతున్న జీప్ అదుపుతప్పి ఇంటి ముందు ఉన్న షెడ్‌లోకి దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటి బయట ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ ఘటనలో ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్ పూర్తిగా దెబ్బతిన్నది. ఈ ఘటనను చూసిన వారు ఒక్కసారి భయాందోళనకు గురయ్యారు. రేకుల షెడ్ పాడైందని, రూ.40 వేల వరకు నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



దమ్మలవీధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు అన్నారు. సార్వత్రిక ఎన్నికలు జరిగి ఫలితాలు రావాల్సిన నేపథ్యంలో నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నగరంలోని దమ్మలవీధి, న్యూ దమ్మలవీధి, మొండేటి వీధి ప్రాంతాల్లో వన్‌టౌన్ పోలీసులతో కలిసి కలియతిరిగారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకు శాంతి భద్రతలకు ఎవరైన విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ-2 శ్యామలరావు, ఏఎస్ఐ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్లకు విద్యుత్ షాక్



- విద్యుత్తు తీగల నెపంతో నరికేస్తున్న సిబ్బంది
- పర్యావరణానికి విఘాతం.. పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి అంటూ ఓ వైపు ప్రభుత్వం ప్రజల్లో చైతన్యం కల్పిస్తుంటే.. మరోవైపు విద్యుత్ ఉద్యోగులు వాటిని తొలగిస్తున్న పరిస్థితి నగరంలో కనిపిస్తుంది. పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు వెయ్యి రూపాయలకు ఒక మొక్కను కొనుగోలు చేసి నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా నాటించారు. అక్కడితో వారి బాధ్యత, ప్రభుత్వం అప్పగించిన పని పూర్తయిందన్న రీతిలో చేతులు దులిపేసుకుంటారు. ఈ నేపథ్యంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మొక్కల సంరక్షణ బాధ్యతలు తీసుకుని వాటిని పెంచే పనిలో పడ్డారు. అయితే గడిచిన కొద్ది రోజులుగా విద్యుత్తు సిబ్బంది తీగెలకు చెట్ల కొమ్మలు అడ్డు తగులుతున్నాయనే నెపంతో.. అడ్డొచ్చి కొమ్మలు తొలగించాల్సింది పోయి మొత్తం చెట్లను మొదలు వరకు నరికేసి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రజా ధనాన్ని వెచ్చి పెంచిన మొక్కలను ఇలా నిర్లక్ష్యంగా తొలగిస్తున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. డీసీసీబీ కాలనీ, సానావీధి, మండల వీధి, డైమాండ్ పార్కు ఏరియా ఇలా చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేయాలని నగరవాసులు కోరుతున్నారు.





డీసీసీబీ కాలనీ, సానావీధి మొదల వరకు నరికేసిన చెట్టు

రిమ్స్‌కెళ్తే రోగాలు తప్పవు



లిఫ్ట్‌లో వస్తున్న దుర్వాసనకు ముక్కు మూసుకుని వెళ్తున్న రోగులు, వారి బంధువులు

శ్రీకాకుళం క్రైం: జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)లో అడుగుపెడితే ఉన్న రోగాలు పోవడం మాట అటుంచితే కొత్త రోగాలు రావడం ఖాయం. పారిశుధ్య పనులు సక్రమంగా లేకపోవడంతో బాతు రూమ్‌లకు వెళ్లాలంటే భయపడుతున్నారు. రోగులకు చికిత్స అందిస్తున్న గదుల్లో కూడా దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు గడిచిన రెండు రోజులుగా రిమ్స్ ఆస్పత్రిలోని ఓ లిఫ్ట్‌లోని ఫ్యాన్‌లో ఎలుక ఇరుక్కుపోయి చనిపోయింది. దీంతో తీవ్రంగా దుర్వాసన వెల్లువడుతుంది. లిఫ్ట్‌లో వెళ్లే వైద్యులు, రోగులు, వారి బంధువులు ఈ దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు. సోమవారం రిమ్స్‌కు వచ్చిన రోగులు లిఫ్ట్‌లో ముక్కులు మూసుకునే పరిస్థితి నెలకొంది. రిమ్స్‌లో పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షించాల్సిన వారు, అధికారులు ముక్కు మూసుకుని వెళ్లారే తప్ప సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడం విశేషం.

రైతే దేశానికి మూలాధారం



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్

కలెక్టరేట్: రైతే దేశానికి మూలాధారమని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్ అన్నారు. వెంకటాపురం గ్రామంలో నైర వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. ఈ నెలాఖరుకు నైరుతి రుతుపవనాలు మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ఇప్పటి నుంచే ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని కోరారు. జిల్లాకు 38 వేల మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు, 22 వేల టన్నుల యూరియా, ఇతర క్రిమి సంహారక మందులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రస్తుతం 10వేల మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు జిల్లాకు వచ్చాయని, వీటిని విక్రయిస్తున్నామని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గేదెల జోగినాయుడు, ఆత్మ పథక సంచాలకులు ఎ.రామచంద్రరావు, అధ్యాపకులు ఉపేంద్రరావు, జ్యోతి, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్రసాము పోటీల్లో ప్రతిభ



చిన్నారులను అభినందిస్తున్న గొండు శంకర్

శ్రీకాకుళం స్పోర్ట్స్: వరల్డ్ యూనియన్ శిలంభం ఫెడరేషన్ (డబ్ల్యూయూఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడలో మూడు రోజుల పాటు జరిగిన ఏసియన్ కర్రసాము పోటీల్లో సిక్కోలు చిన్నారులు ప్రతిభ చూపారు. సింగిల్, డబుల్స్ విభాగాల్లో మూడు బంగారు, రెండు కాంస్య పతకాలు, ఒక రజిత పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక విశాఖ-ఏ కాలనీలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ కార్యాలయంలో చిన్నారులను, కోచ్ హర్షవర్ధన్‌ను అభినందించారు.

సందడిగా ముత్యాలమ్మ పండగ



పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో కొలువైన ముత్యాలమ్మ తల్లి పండగ సందడిగా సాగింది. ఈ సందర్భంగా సోమవారం దేవర ఉత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి అఫీషియల్ కాలనీ సమీపంలో గల మరిడమ్మ ఆలయానికి 108 మంది మహిళలు జంగిడీలతో వెళ్లి చల్లదనం చేపట్టారు. ఈ సందర్భంగా తప్పెట గుళ్లు, డప్పు, సన్నాయి మేళంతో ఊరేగింపుగా వెళ్లారు. కాగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసి విద్యుత్ వెలుగులు ఆకట్టుకుంటున్నాయి.

ప్రణాళికాబద్ధంగా పంపిణీ జరగాలి

పొందూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు విద్యాకానుకల పంపిణీ ప్రణాళికా బద్ధంగా జరగాలని ఎంఈవో-1 పీవీ రామరాజు, ఎంఈవో-2 పి.రాజారావు, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారి పి.జనార్దనరావు తెలిపారు.సోమవారం స్థానిక ఎంఆర్‌సీలో విద్యాకానుకల పంపిణీపై సమీక్షించారు.కార్యక్రమంలో పీటీఐలు, సీఆర్ఎం టీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో మేలు

సోంపేట: పలాసపురంలో ప్రకృతి వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో నవధాన్యాల కిట్లను సోమవారం ఏర్పాటుచేశారు. ఖరీఫ్‌లో తొలకరి వర్షాలకు ముందుకు నవధాన్యాలు సాగు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్య క్రమంలో రీజినల్ అధికారి హేమసుందర్, సత్యనా రాయణ, లోహిదాస్, కుమారి, కామరాజు పాల్గొన్నారు.

50 మంది రక్తదానం

ఇచ్ఛాపురం: పట్టణంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ జయదేవ్ ఆధ్వర్యంలో ఘనంగా ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలు జరిగాయి. సోమవారం ధనేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అనంతరం అభిమానులు కేక్ కట్‌చేశారు. పేదలకు అన్న దానం చేయడంతో పాటు లైన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50మంది ఎన్‌టీఆర్ అభిమానులు, యువత, రక్తదానం చేశారు. ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ కాళ్ల జయదేవ్, బి.కృష్ణయ్య, జన్నెల సంతోష్, ఎండీ జిలానీ, కాళ్ల గోపి, నాగరాజుపాత్రో, వనియ్, నితీష్, విజయ్, దేవా, సంతోష్, జగదీష్, కేదారిపురం ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

బాహుదా వరద గట్టుకు గండి



బాహుదా నదిలో కొట్టుకుపోయిన గట్టు

ఇచ్ఛాపురం: బాహుదానదిలో రూ.రెండు లక్షలతో ఊటబావుల వద్ద నిర్మించిన వరద గట్టుకు గండిపడింది. దీంతో ఉన్న కొద్ది పాటినీరు బయటకు వెళ్లిపోతోంది. ఎన్నికల ముందు గట్టు నిర్మించారు. సక్రమంగా గట్టు నిర్మించకపోవడంతోనే కొట్టుకు పోయిందని టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ టి.శ్రీనివాస సాహు ఆరోపించారు. బాహుదాలో పూర్తిగా నీరు ఇంకిపోవడంతో నది ఎడారిలా మారింది. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఒడిశా అధికారులతో సంప్రదించడంతో బగలెట్టి డ్యాం గేట్లు ఎత్తారు. దీంతో బాహుదా నదిలోకి నీరు చేరింది. ప్రస్తుతం గండిపడడంతో నీరు వృథాగా పోతోంది. నదిలో నీరు పూర్తిగా అడుగంటిపోవడంతో మునిసిపాలిటీ పరిధిలో గల వార్డు ప్రజలకు కొళాయిల ద్వారా తాగునీరు కూడా అందించ లేకపోయారు.

క్రికెట్ టోర్నీ విజేత ఆర్.బెలగాం



ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

కంచిలి: తలతంపరలో నిర్వహించిన నియోజ కవర్గస్థాయి క్రికెట్ టోర్నీలో ఆర్.బెలగాం జట్టు విజయం సాధించింది. సోమవారం కవిటి మండలంలోని ఆర్.బెలగాం, కవిటి జట్లు తలపడ్డాయి. కవిటి జట్టుపై బెలగాం జట్టు గెలుపొందింది. కవిటి జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీ, ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా రవి, బెస్ట్ బౌలర్‌గా రాములకు బహుమతులు టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మర్రిపాటి పూర్ణ అందజేశారు.

కళాకారులకు జాతీయ పురస్కారాలు



పురస్కారాలతో కళాకారులు



అవార్డుతో ధనుంజయరెడ్డి

కవిటి: ఉద్దానం ప్రాంతానికి చెందిన సంగీత కళాకారులు, మృదంగ విద్వాంసులు గొణప లక్ష్మణమూర్తి, మ్యూజిక్ ఆల్‌రౌండర్ చలపరాయి రవికుమార్, మృదంగం కళాకారులు చలపరాయి వల్లభరావుకు తెలుగు వెలుగు సాహితీ వేదిక సేవా సంస్థ జ్ఞానబుద్ధ పూర్ణ జాతీయ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ మేరకు తెలుగు వెలుగు సాహితి వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలులో అవార్డులును అందజేసింది. అవార్డు గ్రహీతలకు కళాకారులు ప్రముఖులు అభినందించారు.

● **ఇచ్ఛాపురం:** టి.బరంపురం గ్రామానికి చెందిన సంగీత కళాకారుడు తిప్పన ధనుంజయరెడ్డి జ్ఞాన బుద్ధ పూర్ణ జాతీయ పురష్కారానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఒంగోలులో జరిగిన తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక ఉత్సవాల్లో అవార్డును అందుకున్నాడు. కళారంగంలో సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు అప్పనపల్లి భాస్కరాచార్యులు తెలిపారు. ధనుంజయ రెడ్డికి పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, ఎంపీపీ బోర పుష్ప, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆల్ ఇండియా కళా రంగం వ్యవస్థాపకులు మాడుగుల సుధీర్, మాజీ ఎంపీపీ కారంగి మోహన్‌రావు అభినందించారు.

24న జాబ్‌మేళా

ఎచ్చెర్ల: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎల్.సుధాకరరావు తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులై, 18-35 ఏళ్ల వయసు గల అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. అల్‌స్ట్రామ్ (నెల్లూరు), ఐసుజు మోటార్స్ లిమిటెడ్ (నెల్లూరు), హుందాయ్ మోబిస్ (అనంతపురం), ఏసీటీ (అనంతపురం), డిక్సాన్ (తిరుపతి), కిమ్స్ (అనంతపురం), కేఎస్‌హెచ్ (అనంతపురం), ఇన్‌ఫిల్‌లూమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (నెల్లూరు), డీఎస్సీ (అనంతపురం), సియోయాన్ హెచ్‌డబ్ల్యూఏ సమ్మిట్ (అనంతపురం), సంగ్‌హూ (అనంతపురం), డికో (నెల్లూరు), ఏసియాన్ ఆటో పార్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ (నెల్లూరు) సంస్థల్లోని 550 ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి, ఐటీఐ, కుల ధ్రువీకరణ ఒరిజినల్ పత్రాలు, ఆధార్ కార్డుతో పాటు బయోడేటా, జెరాక్స్ కాపీలు రెండు సెట్‌లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అన్ని అలవెన్స్‌లతో కలిపి రూ.15,000 నుంచి రూ.18,000 వరకు నెలకు జీతం ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాకు 99593 53636, 63040 33963 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న ఏపీ ఈఏపీ సెట్

ఎచ్చెర్ల: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్-2024 కొనసాగుతోంది. జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), ఐతం (టెక్కలి), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట)లో జేఎన్‌టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. రెండు షిఫ్ట్‌ల్లో కలిపి సోమవారం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో 459కు 433 మంది, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 359కు 340 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈనెల 23వ తేదీ వరకు జరగనున్నాయి.

మార్షల్ ఆర్ట్స్‌లో పతకాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: ఇటీవల పెన్‌కాక్ శిలాట్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన అభినందన సభలో లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్ పాల్గొని విద్యార్థులను అభినందిస్తూ, బహుమతులు అందజేశారు. పతకాలు పొందిన వారిలో దస్విన్, తనూజ్, జగదీష్, కృష్ణదేవ్, శౌర్య, సుధీర్, బాబీ కార్తీక్ అభిరామ్, జ్యోతి తదితరులు ఉన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు

సరుబుజ్జిలి: గ్రామాల్లో రాజకీయ వివాదాల్లో చిక్కుకొని యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్ఐ బి.నిహార్ కోరారు. సోమవారం తెల్లవారుజామున రొట్టవలసలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించి ఎన్నికల తగాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ద్విచక్రవాహనాలను తనిఖీ నిర్వహించి 13 బైక్‌లకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ నిహార్ తెలిపారు. కార్య క్రమంలో పోలీసులు రెడ్డి చంద్రినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి వరకు ఇంటర్ దరఖాస్తులకు అవకాశం

కంచిలి: స్థానిక ప్రభుత్వ మోడల్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ఇంటర్ చేరేందుకు బుధవారంలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మోడల్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

అభిమానులే నిజమైన హీరోలు

శ్రీకాకుళం అర్బన్: అభిమానులు నిజమైన హీరోలని టీడీపీ నాయకులు, శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. జూ.ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఎస్‌వీసీ థియేటర్‌లో అభిమానులు గోవిందరావు, ఉదయ్‌కిరణ్, రవి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను గొండు శంకర్ చేతుల మీదుగా అందించారు. థియేటర్ మేనేజర్ బి.రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

● **రణస్థలం:** జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం కొండములగాంలో బాలి సందీప్, బాలి తేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రామతీర్థం జంక్షన్‌లో మజ్జిక ప్యాకెట్లు అందించారు.

రజత కవచ దర్శనంలో వెంకన్న

శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి రజతకవచ దర్శనంలో అలంకరించారు. ఈ సందర్భంగా విశేష ఆరాధన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ముమ్మరంగా సీడబ్ల్యూఎస్ఎన్ సర్వే

పొందూరు: జిల్లాలో చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ (సీడబ్ల్యూఎస్ఎన్) సర్వే ముమ్మరంగా సాగుతోంది. దివ్యాంగ విద్యార్థులకు పథకాలు అందించేందుకు కేంద్రప్రభుత్వ సర్వే చేపట్టింది. ఇందుకోసం కేంద్రం సర్వశిక్షా అభియాన్‌లో ప్రత్యేకంగా సహిత విద్యా విభాగాన్ని ఏర్పాటుచేసింది. ప్రస్తుతం దివ్యాంగ హక్కుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యంగల 18 సంవత్సరాలలోపు విద్యార్థులను ప్రత్యేక అవసరాల గల పిల్లలుగా ప్రభుత్వం గుర్తించింది. జిల్లాలో జూన్ తొమ్మిదో తేదీ వరకు నిర్వహించనున్న సీడబ్ల్యూఎస్ఎన్ సర్వేలో గుర్తించిన వారిని ఆయా మండలాల పరిధిలో పాఠశాలల్లో చేర్పించడంతో పాటు భవిత కేంద్రాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తారు.

30 భవిత కేంద్రాలు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి సాధారణ విద్యార్థుల మాదిరిగా విద్యనందించడంతో పాటు వారి వైకల్యానికి అవసరమైన పరికరాలు అందించడం శిక్షణ ఇవ్వడం భవిత కేంద్రాల లక్ష్యం. జిల్లాలో 30 మండలకేంద్రాల్లో స్వర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద ఈ భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో ఇద్దరు చొప్పున ఐఈఆర్‌పీలను నియమించారు. వీరితో పాటు ఫిజియోథెరపిస్టులను నియమించి దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పరికరాల ద్వారా విద్యను అందిస్తున్నారు.

9 వరకు సర్వే

జిల్లాలో ఏ ఒక్క ప్రత్యేక అవసరాలు గల విద్యార్థి పభుత్వపథకాలకు దూరంగా ఉండకూడదన్న లక్ష్యంతో ఎస్ఎస్ఏ ఉన్నతాధికారులు, ఐఈఆర్‌పీలు, పాఠశాలల్లో స్పెషల్ టీచర్లుతో జిల్లాలో మే ఒకటో తేదీ నుంచి సీడబ్ల్యూఎస్ఎన్(చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్) సర్వే నిర్వహిస్తున్నారు. జూన్ తొమ్మిదో తేదీ వరకు సర్వేలో జిల్లాలో జరగనుంది. సర్వేలో ఇప్పటివరకు జిల్లాలో 30 మండలాల్లో 251 మంది 21 రకాల దివ్యాంగ విద్యార్థులను గుర్తించారని జిల్లా సహిత విద్యా విభాగం కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు తెలిపారు.

ఎస్ఎస్ఏదే విదార్థుల బాధ్యత

జిల్లాలో ఉన్న 21 రకాల దివ్యాంగ విద్యార్థులను గుర్తించే బాధ్యత ఎస్ఎస్ఏలోని సహిత విద్యావిభాగం తీసుకుందని ఎస్ఎస్ఏ ఏపీసీ రోణంకి జయప్రకాశ్ తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల సమాచారం అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.